



RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్

వార్తా పత్రిక

విలేకరులు కావలెను
తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువతీ యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం
న్యూస్ వార్ దిన పత్రిక
నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో
వార్తా సేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.
94409 91979

నల్లగొండ | epaper.news war.com | బుధవారం 19 ఆగస్టు 2026 | సంపుటి :16 సంచిక :130 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00



అయోధ్య రామ మందిరం విరాళాల కేసు..

## చంపత్ రాయ్‌కు సిట్ క్లీన్‌చిట్..!

అయోధ్య రామ మందిరం విరాళాల కేసులో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) క్లీన్ చిట్ ఇచ్చినట్లు సమాచారం.

వివరాలు 2లో..



విద్యార్థులపై ఏకే-47తో కాల్పుల ఘటన..

## సుప్రీంకోర్టులో బిహార్ ప్రభుత్వం అఫిడవిట్..

నీట్-యూజీ పేపర్ లీక్ నిరసనల్లో విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరపడం నిజమేనని సుప్రీంకోర్టుకు బిహార్ ప్రభుత్వం తెలిపింది. జులై 25న సివాన్‌లో జరిగిన ఈ కాల్పుల్లో ఎవరూ తీవ్రంగా గాయపడలేదని స్పష్టం చేసింది. ఆందోళనకారుల మధ్య కానిస్టేబుల్ చిక్కుకుపోవడంతో ఏకే-47తో కాల్పులు జరపాల్సి వచ్చిందని కోర్టు దృష్టికి తెచ్చింది. ఈ మేరకు అఫిడవిట్ ద్వారా సుప్రీంకోర్టుకు కీలక విషయాలను వెల్లడించింది.

## మీరు చేసిన తప్పులకి ప్రజలకు

# ఎందుకు శిక్ష..

- రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది
- సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా?
- ఏ పని కావాలన్నా 30% కమీషన్ అడుగుతున్నారు'
- వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలి
- ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ పనిచేయట్లేదు.
- పొంగులేటిపై హరీశ్ ఫైర్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్‌ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష? పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30% గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30% కమీషన్ అడుగుతున్నారు' అంటూ విరుచుకుపడ్డారు.

వార్త 2లో

## హరీశ్‌రావు కాదు..

# అబద్ధాల రావు..

- కొండను తవ్వి ఎలుకను పట్టారు
- దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారు
- సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగింది
- ఆ భూములను 22ఏ నుంచి తొలగిస్తాం..
- విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలి
- మంత్రి పొంగులేటి సెటైర్లు



వార్త 2లో

మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు కాదు ఆయన అబద్ధాల రావు అని ఎద్దేవా చేశారు. 22ఏ లో ఆయన కొండను తవ్వి ఎలుకను పట్టారని.. దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారని సెటైర్లు గుప్పించారు. ఈరోజు (మంగళవారం) మంత్రి పొంగులేటి మాట్లాడారు. గతంలో సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగిందని తామే గుర్తించామని పేర్కొన్నారు.



మహాత్మా గాంధీ

## ఆలపించిన గేయాన్నే నేనూ పాడాను: ఖర్గే

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో వందేమాతర గేయం ఆలాపనపై వివాదం అంతకంతకూ ముదురుతోంది. అయితే, పార్టీ అధ్యక్షుడు ఖర్గే మాత్రం తమ తీరు ను సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

2

ఆ భూములను లాక్కుంటే..

# చూస్తూ ఊరుకోం..



2

తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి సర్కార్ లాక్కుంటే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈరోజు (మంగళవారం ) హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. ప్రశ్నించారు.



2

## వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు ధన్యవాదములు: సీపీ సజ్జనార్

వాచ్- సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.1300 కోట్ల వ్యయంతో కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లైఓవర్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

కేబీఆర్ చుట్టూ వన్‌వే..

## వాహనదారుల్లో గందరగోళం



కేబీఆర్ చుట్టూ ట్రాఫిక్ పోలీసులు వన్‌వే అమలు చేయడంతో వాహనదారుల్లో గందరగోళం కొనసాగుతోంది. ఎటు వెళ్లాలో తెలియక వాహనదారులు తికమక పడుతున్నారు. దారి తెలియక కొందరు రాంగ్ రూట్‌లోకి వెళ్తున్నారు. కేబీఆర్ వన్‌వే ఎఫెక్ట్‌తో ఉదయం నుంచే ట్రాఫిక్ కష్టాలు ఎక్కువ అయ్యాయి. ట్రాఫిక్‌లో చిక్కుకుని సైరన్లు, హారన్‌లతో వాహనదారులు హోరెత్తిస్తున్నారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

వార్త 2లో



## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట.. సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు



2

బీజేపీకి అనుబంధ సంస్థగా మారిన

# ఎన్నికల సంఘం: టీపీసీసీ చీఫ్

2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు.

# హరీశ్‌రావు కాదు.. అబద్ధాల రావు..

### కొండను తవ్వి ఎలుకను పట్టారు

### దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారు

### సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగింది

### ఆ భూములను 22ఏ నుంచి తొలగిస్తాం..

### విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలి

### మంత్రి పొంగులేటి సెటైర్లు



హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు కాదు ఆయన అబద్ధాల రావు అని ఎద్దేవా చేశారు. 22ఏ లో ఆయన కొండను తవ్వి ఎలుకను పట్టారని.. దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారని సెటైర్లు గుప్పించారు. ఈరోజు (మంగళవారం) మంత్రి పొంగులేటి మాట్లాడారు. గతంలో సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగిందని తామే గుర్తించామని పేర్కొన్నారు.

**ఆ భూములను 22ఏ నుంచి తొలగిస్తాం..**

హరీశ్‌రావు ఎత్తు పెరగడం కాదని.. విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలని మంత్రి వ్యగ్యంగా మాట్లాడారు. ఎవరికీ అన్యాయం జరగనివబోమని అన్నారు. ప్రభుత్వ భూములు కాకపోతే కచ్చితంగా వాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో మాదిరిగా తాము బుకాయించడం లేదని చెప్పారు. కేంద్రం, ఎన్నికల సంఘం, బీఆర్ఎస్ కలిసి ఓట్లను తొలగించే కుట్రను చేస్తున్నాయని.. వారి పప్పులు ఉడకనివ్వబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

# అయోధ్య రామ మందిరం విరాళాల కేసు.. చంపత్ రాయ్‌కు సిట్ క్లీన్‌చిట్..!

లఖ్‌నవూ: న్యూస్‌వార్ ప్రతినిధి

అయోధ్య రామ మందిరం విరాళాల కేసులో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) క్లీన్ చిట్ ఇచ్చినట్లు సమాచారం. ఆయనతో పాటు.. ట్రస్ట్ మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు కూడా క్లీన్‌చిట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. చంపత్ రాయ్‌కు విరాళాల చోరీ కేసుతో ఎలాంటి సంబంధం లేదని సిట్ తన తొలి నివేదికలో పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సిట్ తన నివేదికను రాష్ట్ర హోంశాఖకు ఇవ్వగా.. ఈ నివేదిక పరిశీలన అనంతరం తదుపరి చర్యల కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందించినట్లు సమాచారం.యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ నివేదికలో చంపత్ రాయ్‌తో పాటు మాజీ ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా పేర్లు కూడా లేవని సమాచారం. అయితే, విరాళాల వ్యవహారంలో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో వీరిద్దరూ జూన్ 27న ట్రస్ట్‌లోని తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అభ్యర్థన మేరకు సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలతో జూన్ 13న తొలి సిట్‌ను ఏర్పాటు చేశారు. లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ నేతృత్వంలో ఈ బృందం దర్యాప్తు చేపట్టింది.

**సుప్రీంకోర్టు పర్యవేక్షణలో మరో సిట్..**

రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో మరో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ నిర్వహిస్తోంది. దర్యాప్తును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు సోమవారం సిట్‌ను ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం.. దర్యాప్తు పురోగతిని వివరిస్తూ సీల్డ్ కవర్‌లో స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ఫోరెన్సిక్ ఆడిటర్‌తో కూడిన సిట్ నివేదికను ముందుగా కోర్టు పరిశీలిస్తుందని, అనంతరం దాన్ని కేసులోని సంబంధిత పక్షాలతో పంచుకోవాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది. దర్యాప్తు నాణ్యత, పారదర్శకతను మెరుగుపరిచేందుకు పిటిషనర్లు, ఇతర ప్రజాహిత వ్యక్తులు ఇచ్చే సూచనలను నిష్పక్షపాతంగా పరిశీలించాలని సిట్‌కు కోర్టు సూచించింది.

# విద్యార్థులపై ఏకే-47తో కాల్పుల ఘటన.. సుప్రీంకోర్టులో బిహార్ ప్రభుత్వం అఫిడవిట్..

బిహార్: న్యూస్‌వార్ ప్రతినిధి

నీట్-యూజీ పేపర్ లీక్ నిరసనల్లో విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరపడం నిజమేనని సుప్రీంకోర్టుకు బిహార్ ప్రభుత్వం తెలిపింది. జులై 25న సివాన్‌లో జరిగిన ఈ కాల్పుల్లో ఎవరూ తీవ్రంగా గాయపడలేదని స్పష్టం చేసింది. ఆందోళనకారుల మధ్య కానిస్టేబుల్ చిక్కుకుపోవడంతో ఏకే-47తో కాల్పులు జరపాల్సి వచ్చిందని కోర్టు దృష్టికి తెచ్చింది. ఈ మేరకు అఫిడవిట్ ద్వారా సుప్రీంకోర్టుకు కీలక విషయాలను వెల్లడించింది.ఈ సందర్భంగా జులై 25న నిరసనల్లో సివాన్‌లోని జేపీ చౌక్ వద్ద నిరసనకారుల మధ్య కానిస్టేబుల్ అభిషేక్ కుమార్ చిక్కుకున్నాడని బిహార్ ప్రభుత్వం పేర్కొంది. వారి నుంచి తప్పించుకునేందుకు కానిస్టేబుల్ ఏకే-47తో గాలిలోకి నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాడని తెలిపింది. మరోవైపు, నిరసనకారులను చెదరగొట్టేందుకు హతి చౌక్ సమీపంలో అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ నిలేశ్ కుమార్ సింగ్ కూడా 9ఎంఎం పిస్టల్‌తో రెండు రౌండ్లు కాల్పులు జరిపారని చెప్పుకొచ్చింది. పోలీసుల చర్యలో ముగ్గురు ఆందోళనకారులకు చిన్నపాటి తుపాకీ గాయాలయ్యాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, వారు ఏకే-47 బుల్లెట్లతో గాయపడలేదని తేల్చిచెప్పింది. అలాగే, కానిస్టేబుల్ కాల్పులు జరిపిన ప్రదేశంలో ఎవరూ గాయపడలేదని పేర్కొంది.మరోవైపు, కానిస్టేబుల్ అభిషేక్ కుమార్‌ను సస్పెండ్ చేశామని, అతను శాఖాపరమైన విచారణను ఎదుర్కొంటున్నాడని అఫిడవిట్‌లో బిహార్ ప్రభుత్వం తెలిపింది. ఆరోజు భద్రతా దళాలు సంయమనం పాటించాయని.. నిరసనకారులకు ఎలాంటి హాని కలిగించేందుకు ప్రయత్నించలేదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులపై విపరీతమైన బలప్రయోగం చేయలేదనీ వివరించింది. ప్రభుత్వ ఆస్తుల నష్టం, అధికారులపై దాడులకు నిరసనల్లో చేరిన అసాంఘిక శక్తులే కారణమని ప్రభుత్వం ఆరోపించింది. అలాగే నిరసనలకు సంబంధించిన జిల్లాల వారీ వివరాలనూ సుప్రీంకోర్టుకు సమర్పించింది.కాగా, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఉద్యమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు దురాగతాలకు పాల్పడ్డారని ఆగస్టు 17న ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. దీనికి ప్రతిస్పందనగా బిహార్ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది.

# మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష..

### రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

### సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా?

### ఏ పని కావాలన్నా 30% కమీషన్ అడుగుతున్నారు'

### వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలి

### ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ పనిచేయట్లేదు.

### పొంగులేటిపై హరీశ్ ఫైర్

మల్కాజిగిరి, న్యూస్‌వార్ ప్రతినిధి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష? పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30% గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30% కమీషన్ అడుగుతున్నారు' అంటూ విరుచుకుపడ్డారు.రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో ఉందని.. మరి సీఎం ఎక్కడ మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్టర్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాల నుంచి తొలగించిన భూముల లిస్టును పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని.. తప్పు వారు చేసి అధికారులపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.'అధికారులూ జాగ్రత్త.. మీరు తప్పు చేస్తే రేపు మీరే బలవుతారు. మీ కమీషన్ల కోసం పెన్ను పోటుతో ప్రజల జీవితాలను బలి చేయొద్దు. రేపు ఎప్పుడు అసెంబ్లీ పెట్టినా నిషేధిత భూములపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నిలదీస్తుంది.. ప్రజలకు అండగా ఉంటుంది. ప్రజల ఆస్తులపై మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తామంటే పాతర వేస్తారు. ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ పనిచేయట్లేదు... మీ జనతా గ్యారేజ్ తెలంగాణ భవన్ ఎప్పుడూ మీకోసం తెరిచే ఉంటుంది' అని హరీశ్ రావు పేర్కొన్నారు.

# మహాత్మా గాంధీ ఆలపించిన గేయాన్నే నేనూ పాడాను: ఖర్గే

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో వందేమాతర గేయం ఆలాపనపై వివాదం అంతకంతకూ ముదురుతోంది. అయితే, పార్టీ అధ్యక్షుడు ఖర్గే మాత్రం తమ తీరును సమర్థించుకునే ప్రయత్నం చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పాడిన గేయాన్నే తాను ఆలపించానని మంగళవారం ఖర్గే స్పష్టం చేశారు.అప్పటి పాటను పాడటం నేరమే అయితే కేంద్రం ఆ దివంగత నేతలపై కూడా కేసులు పెట్టాలని వ్యాఖ్యానించారు. 'గాంధీ, నెహ్రూ, పటేల్ జన్మించకముందే భారత్ జాతీయ గేయాలు ఏవో నిర్ణయిస్తూ కాంగ్రెస్ ఒక తీర్మానాన్ని పాస్ చేసింది. మీరు చెప్పినదల్లా జాతీయ ప్రమాణికం అయిపోదు. ఇలాగైతే రేపు మరో ప్రభుత్వం అధికారంలో వచ్చి చెప్పేది కూడా రూల్ అయిపోవచ్చు. 90 ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీనే మేమూ కొనసాగిస్తున్నాము' అని ఖర్గే అన్నారు.ఇక దక్షిణ గోవాలో తాజాగా జరిగిన ఓ ర్యాలీలో కూడా ఖర్గే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై మండిపడ్డారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏంటో చెప్పాలని సవాలు విసిరారు. రాష్ట్రంలో కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలను కిడ్నాప్ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు.స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ఆలాపన సందర్భంగా ఖర్గే, సోనియా గాంధీ మాట్లాడుతున్నట్టు ఉన్న వీడియో వైరల్ కావడంతో కాంట్రవర్సీ మొదలైన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అగ్రనేతలు వందేమాతర గేయాన్ని అవమానించారని బీజేపీ మండిపడింది. బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది.

# పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట.. సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

జైలు శిక్ష అనుభవిస్తున్న పాక్ మాజీ ప్రధాని, పీటీఐ అధినేత ఇమ్రాన్ ఖాన్‌కు తాజాగా భారీ ఊరట దక్కింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఖాన్‌ను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించాలని పాక్ సుప్రీం కోర్టు తాజాగా ఆదేశించింది. 48 గంటల్లోపు ఆయనను ఆసుపత్రిలో చేర్పించాలని స్పష్టం చేసింది. ఖాన్ ఆరోగ్యంపై దృష్టి సారించేందుకు త్వరలో ఓ మెడికల్ బోర్డు కూడా ఏర్పాటు కానుందని తెలిపింది. ఈ బోర్డులో ఖాన్ వ్యక్తిగత వైద్యుడితో పాటు ఆయన సోదరి డా. ఉజ్మాఖాన్ కూడా సభ్యులుగా ఉంటారని తెలిపింది. అయితే, ఇమ్రాన్ ఖాన్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో వైద్య రికార్డులను బహిరంగ పరిచి రాజకీయ వివాదాలను రెచ్చగొట్టొద్దని ఆయన తరపు లాయర్లకు స్పష్టం చేసింది. ఇమ్రాన్ ఖాన్‌ను వారానికి ఒకసారి తన కుటుంబసభ్యులను కలిసేందుకు అనుమతించాలని కూడా ప్రభుత్వానికి స్పష్టం చేసింది.2023 నుంచి ఇమ్రాన్ ఖాన్ జైల్లో ఉంటున్న విషయం తెలిసిందే. అవినీతితో పాటు ఇతరత్రా కేసుల్లో దోషిగా తేలిన ఆయన అడియాలా జైల్లో ఉంటున్నారు. అయితే తాను నిర్దోషినని ఇమ్రాన్ ఖాన్ మొదటి నుంచీ వాదిస్తున్నారు. రాజకీయ దురుద్దేశాలతో కేసులు పెట్టి జైలుపాలు చేశారని పలుమార్లు ఆరోపించారు. మరోవైపు, ఆయన ఆరోగ్యం అంతకంతకూ దిగజారుతోందని ఇమ్రాన్ ఖాన్ తనయులు, వారి లాయర్లు గతేడాదిగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయన కుడి కంటి చూపు బాగా తగ్గిపోయిందని కూడా చెప్పారు ప్రస్తుతం వైద్య కారణాలతో ఇమ్రాన్ ఖాన్‌కు కాస్త ఊరట లభించడంతో పీటీఐ అధికార ప్రతినిధి హర్షం వ్యక్తం చేశారు. ఇంకాస్త ముందుగా ఇది జరిగి ఉంటే మెరుగ్గా ఉండేదని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యం పూర్తిగా మెరుగయ్యే వరకూ ఇమ్రాన్ ఖాన్‌ను ఆసుపత్రిలోనే ఉంచాలని డిమాండ్ చేశారు.2018 ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి ప్రధాని అయిన ఇమ్రాన్ ఖాన్ ఆ తరువాత 2022 నాటి బలనిరూపణలో ఓడిపోయి ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. ఆ తరువాత ఆయనపై అవినీతి, చట్టవ్యతిరేకంగా వివాహం చేసుకోవడం వంటి అనేక కేసులు దాఖలయ్యాయి. కొన్నింట్లో ఆయన దోషిగా తేలారు. మరికొన్నిటిని కోర్టులు కొట్టేశాయి. మరికొన్ని కేసుల్లో అప్పీళ్లపై ఇంకా విచారణ జరుగుతోంది. పీటీఐ తన పార్టీ గుర్తు కూడా కోల్పోవడంతో 2024 ఎన్నికల్లో పీటీఐ నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందారు. ఇప్పటికీ పాక్‌లో పీటీఐకి ప్రజల మద్దతు చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉందని అక్కడి మీడియా చెబుతోంది.

# వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు ధన్యవాదములు: సీపీ సజ్జనార్

హైదరాబాద్,

: హెచ్- సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.1300 కోట్ల వ్యయంతో కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లైఓవర్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ వీసీ సజ్జనాం కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ పార్కు చుట్టూ ఫ్లైఓవర్‌ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు ఇవాళ్టి(మంగళవారం) నుంచి ఈ పార్కు చుట్టూ వన్ వే చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో చాలామంది ప్రజలు సంతోషిస్తున్నారని తెలిపారు.'కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు అందరికి ధన్యవాదములు.

# ఆ భూములను లాక్కుంటే.. చూస్తూ ఊరుకోం..

### రేవంత్ సర్కార్‌కు కవిత వార్నింగ్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి సర్కార్ లాక్కుంటే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈరోజు (మంగళవారం ) హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

**విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టారు..**

విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వం నియమించిన అడ్వైజర్ల జీతాల విషయంలోనే సామాజిక న్యాయం ఎందుకు కనిపించట్లేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం ఆటవికా న్యాయమా..? అని ప్రశ్నించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఓ రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా..? ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం.? అని ప్రశ్నల వర్షం కురిపించారు.

**రేవంత్‌రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్..**

రేవంత్‌రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్‌గా మారిపోయిందని కవిత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో కూడా మూడు వేల ఎకరాల భూమిని పేదలకు ఇచ్చారని.. ఆ తర్వాత ఆపేశారని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలోని, అన్యాక్రాంతమైన భూములను సేకరించి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వడం సాధ్యమేనని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి - పదేపదే గతంలో జరిగిన విషయాలనే ప్రస్తావిస్తూ.. చేయాల్సిన పనులను పక్కన పెట్టకూడదని కవిత హితవు పలికారు.

# కేబీఆర్ చుట్టూ వన్‌వే.. వాహనదారుల్లో గందరగోళం

హైదరాబాద్,

కేబీఆర్ చుట్టూ ట్రాఫిక్ పోలీసులు వన్‌వే అమలు చేయడంతో వాహనదారుల్లో గందరగోళం కొనసాగుతోంది. ఎటు వెళ్లాలో తెలియక వాహనదారులు తికమక పడుతున్నారు. దారి తెలియక కొందరు రాంగ్ రూట్‌లోకి వెళ్తున్నారు. కేబీఆర్ వన్‌వే ఎఫెక్ట్‌తో ఉదయం నుంచే ట్రాఫిక్ కష్టాలు ఎక్కువ అయ్యాయి. ట్రాఫిక్‌లో చిక్కుకుని సైరన్లు, హారన్‌లతో వాహనదారులు హోరెత్తిస్తున్నారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్- 5 సిగ్నల్ వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంకటగిరి పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి రోడ్డు నంబర్- 5 సిగ్నల్ వరకు భారీగా ట్రాఫిక్ అయింది. రోడ్డు నంబర్-10-జ నుంచి రోడ్డు నంబర్- 5 సిగ్నల్ వరకు వాహనాల రద్దీ కొనసాగుతోంది.వన్ వే ట్రాఫిక్ అమలుతో జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వద్ద వాహనదారులు కన్ఫ్యూజ్ అవుతున్నారు. యూసుఫ్ గూడ, వెంకటగిరి నుంచి రోడ్డు నంబర్- 36, రోడ్డు నంబర్- 45కి వెళ్లేవారిని కేబీఆర్ పార్క్ వైపు ట్రాఫిక్ పోలీసులు పంపిస్తున్నారు. కేబీఆర్ పార్క్ చుట్టూ తిరిగి పోవాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. చెక్ పోస్ట్ వరకు వచ్చి... రాంగ్ రూట్లో మళ్లీ వెనక్కు తిరిగి బైకర్స్ వెళ్తున్నారు. రోడ్డు నంబర్- 36కు వెళ్లేవారు చెక్‌పోస్ట్ వరకు రాకుండా వెంకటగిరి జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్- 10, డైమండ్ హౌస్ ద్వారా వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. కేబీఆర్ పార్క్ చుట్టూ తిరగాలని, సరైన సైన్ బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని పోలీసులతో వాహనదారులు గొడవ పడుతున్నారు.

# బీజేపీకి అనుబంధ సంస్థగా మారిన ఎన్నికల సంఘం: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్,

2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎస్ఐఆర్ పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

సంపాదకీయం...

# 'ఉపాధి' ఉసూరు మంటోంది!

**జులైలో విబి జిరామ్ జి కింద 7.67కోట్ల వ్యక్తి- పని దినాలు.. గత ఏడాది ఎంజిఎన్ఆర్ఇజిలో 15.33 కోట్లు; ఉపాధి పొందిన కుటుంబాలు 51% తగ్గుదల కొత్తగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్- గారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ విబి జిరామ్ జి పథకం అమల్లోకి వచ్చిన తొలి నెలలోనే గ్రామీణ ఉపాధి కల్పనలో గణనీయమైన తగ్గుదల నమోదైంది. దీంతో కొత్త ఉపాధి హామీ పథకం అమలు, అందుబాటుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 2026 జులైలో ఈ పథకం కింద 7.67కోట్ల వ్యక్తి-పని దినాలు మాత్రమే నమోదయ్యాయి. 2025 జులైలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజిఎన్ఆర్ఇజి కింద నమోదైన 15.33కోట్ల వ్యక్తి-పని దినాలతో పోలిస్తే ఇది దాదాపు 50% తక్కువ. ఉపాధి పొందిన గ్రామీణ కుటుంబాల సంఖ్య కూడా 1.42కోట్ల నుంచి 68.94లక్షలకు తగ్గి, 51.45% క్షీణించింది. 2026 జులై 1 నుంచి విబి జిరామ్ జి, ఎంజిఎన్ఆర్ఇజి స్థానంలో అమల్లోకి వచ్చింది. ఈ పథకం కింద ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 100 రోజులకు బదులుగా 125రోజుల ఉపాధి హామీ కల్పిస్తున్నారు. ఉపాధి తగ్గడానికి ఎంజిఎన్ఆర్ఇజి నుంచి కొత్త విధానానికి మార్పు, వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగే కాలంలో ఉపాధి కల్పనకు విరామం, బీహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలనుంచి వలస కార్మికుల సంఖ్య తగ్గడం వంటి అనేక కారణాలు ఉన్నాయి. కొత్త విధానం ప్రకారం, విత్తనాలు వేయడం, పంట కోత వంటి కీలక వ్యవసాయ కాలాల్లో 60రోజుల వరకు ఉపాధి పనులను నిలిపివేసే అవకాశం రాష్ట్రాలకు ఉంది. దీంతో వ్యవసాయ పనులకు కార్మికులు అందుబాటులో ఉంటారని ప్రభుత్వం భావిస్తోంది.**

ఎంజిఎన్ఆర్ఇజిలో ఇలాంటి నిబంధన లేదు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మాత్రం కొత్త విధానంలోకి మార్పు సజావుగానే జరిగిందని చెబుతోంది. ఉపాధి కోరిన గ్రామీణ కుటుంబాల్లో 98 శాతానికి పైగా కుటుంబాలకు పని కల్పించినట్లు పేర్కొంది. జులైలో వాస్తవ ఉపాధి కల్పన సుమారు 9కోట్ల వ్యక్తి-పని దినాలుగా ఉందని కూడా అంచనా వేసింది. అయితే, కాలానుగుణ పరిమితులు, సాంకేతిక నిబంధనలు, పాత పథకం నుంచి కొత్త పథకానికి మారే క్రమంలో ఏర్పడిన సమస్యలు ఉపాధి గణాంకాల భారీ తగ్గుదలకు కారణమై ఉండవచ్చని విమర్శకులు అంటున్నారు. విబి జిరామ్ జి, ఎంజిఎన్ఆర్ఇజిలోని డిమాండ్ ఆధారిత విధానం నుంచి మరింత నియంత్రిత, సరఫరా ఆధారిత విధానానికి మార్పును సూచిస్తోందని కార్మిక సంఘాలు, విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ పనులు జరిగే కాలంలో ఉపాధిపై పరిమితులు విధించడం వల్ల ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్న కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందని వారు అంటున్నారు. అలాగే డిజిటల్ ధ్రువీకరణ, సాంకేతిక ఆధారిత అమలుపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా డిజిటల్ ధ్రువీకరణలో ఇబ్బందులు ఎదుర్కొనే గ్రామీణ కార్మికులకు ఈ నిబంధనలు సమస్యగా మారవచ్చని విమర్శకులు పేర్కొంటున్నారు. విబి జిరామ్ జిలో ప్రధాన మార్పుల్లో ఒకటి వార్షిక ఉపాధి హామీని 100 నుంచి 125 రోజులకు పెంచడం. అయితే, గ్రామీణాభివృద్ధిపై పార్లమెంటరీ స్థాయి సంఘం చేసిన సిఫార్సు కంటే ఇది తక్కువ. 2025 మార్చి 12న సమర్పించిన నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, ప్రతి కుటుంబానికి హామీ ఇచ్చే ఉపాధి దినాలను 100 నుంచి కనీసం 150 రోజులకు పెంచాలని సిఫార్సు చేసింది. గ్రామీణ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఎంజిఎన్ఆర్ఇజిను సమగ్రంగా సమీక్షించడంతో పాటు, పనుల స్వభావాన్ని విస్తరించాలని కూడా కమిటీ సూచించింది. కొత్త విధానంలో నైపుణ్యం లేని కూలీలకు ఏకరీతి వేతన రేటును నిర్ణయించే అవకాశం ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను క్రమం తప్పకుండా సవరించే స్పష్టమైన విధానం లేదని విమర్శకులు అంటున్నారు. ధరలు పెరుగుతున్న సమయంలో వేతనాలకు తగిన సూచీ ఆధారిత సవరణలు లేకపోతే గ్రామీణ కార్మికుల వాస్తవ ఆదాయం తగ్గిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇది పేద కుటుంబాలకు సామాజిక భద్రతా వలయంగా ఉండాల్సిన పథకం ప్రభావాన్ని బలహీనపరచవచ్చని అభిప్రాయపడుతున్నారు. విబి జిరామ్ జిలో కేంద్ర- రాష్ట్రాల మధ్య నిధుల భాగస్వామ్య విధానంలో కూడా మార్పు వచ్చింది. ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం 90% వ్యయాన్ని భరిస్తుంది. ఇతర రాష్ట్రాలు, శాసనసభ కలిగిన కేంద్ర పాలిత



ప్రాంతాల్లో 60:40 నిష్పత్తిలో కేంద్రం- రాష్ట్రాలు వ్యయాన్ని భరించాల్సి ఉంటుంది. ఫిస్కల్ మెమోరాండం ప్రకారం, వేతనాలు, మెటీరియల్, పరిపాలనా ఖర్చులతో కలిపి ఈ పథకం వార్షిక వ్యయం రూ. 1,51,282 కోట్లుగా అంచనా. ఇందులో కేంద్రం వాటా రూ. 95,692.31 కోట్లు కాగా, రాష్ట్రాలపై సుమారు రూ. 56,000 కోట్ల భారం పడనుంది. ఆర్థిక వనరులు పరిమితంగా ఉన్న రాష్ట్రాలపై పెరిగిన వాటా అదనపు ఆర్థిక ఒత్తిడిని కలిగించవచ్చని విమర్శకులు అంటున్నారు.

# అప్పుడు అర్బన్ నక్సల్స్... ఇప్పుడేమో దిమాగీ నక్సల్స్

## ప్రధాని ఎర్రకోట్ ప్రసంగంలో ప్రస్తావనపై విమర్శలు

## మండిపడుతున్న వివిధ రాజకీయ పార్టీల నేతలు



**న్యూఢిల్లీ,**

ప్రధాని నరేంద్రమోడీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎర్రకోట పై నుంచి దిమాగీ నక్సల్స్ అనే వ్యాఖ్యలు చేయడం ప్రతిపక్షాల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంలో ఉపయోగించిన దిమాగీ నక్సల్ పదంపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యపై కాంగ్రెస్, సీపీఐ, సమాజ్‌వాదీ తదితర ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ.. మోదీ గతంలో తన రాజకీయ ప్రత్యర్థులను అర్బన్ నక్సల్స్ అని పిలిచారని, ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అంటున్నారని విమర్శించారు. ఇది ప్రధాని నిరాశకు సంకేతమని అన్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు దిమాగీ నక్సల్స్ అంటే ఎవరో చెబుతూ సోషల్ మీడియా పోస్ట్ పెట్టారు. దీనికి కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం వ్యంగ్యంగా స్పందిస్తూ.. తాను 'దిమాగీ నక్సల్స్‌గా ఉండటానికి గర్విస్తున్నారని అన్నారు. రిజిజు ప్రకారం, దిమాగీ నక్సల్స్ అంటే.. మావోయిస్టులకు మద్దతు ఇస్తూ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించే వారు, వేర్పాటువాదులకు మద్దతు ఇచ్చేవారు, ఆర్టికల్ 370కు మద్దతు ఇచ్చేవారు, దేశ ఈశాన్య ప్రాంతాన్ని భారతదేశం నుంచి వేరు చేయడానికి చికెన్ నెక్‌ను తెంచాలని కోరుకునేవారు అని అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అనే పదంపై సీపీఎం, కాక్రోచ్ జనతా పార్టీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎర్రకోటపై నుంచి జాతిని ఉద్దేశిస్తూ ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోడీ.. అడవుల్లో ఆయుధాలు పట్టుకుని పోరాడిన నక్సలైట్లను దాదాపుగా అంతం చేశామని చెప్పారు. అయితే మావోయిస్టు భావజాలంతో ఉన్న దిమాగీ నక్సల్స్‌ఇంకా అవకాశాల కోసం చూస్తున్నారని, హింస, అశాంతికి దారి తీసే ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలంటే అలాంటి వారిని గుర్తించి ఏకాకులు చేయాలని మోడీ అన్నారు. ఈ పదాన్ని ఉపయోగించడంపై సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ స్పందించారు. ఈ పదాన్ని ప్రభుత్వాన్ని విమర్శించే వారిని, జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టే వారిని ఉద్దేశించి చేశారని ఆయన అన్నారు. గతంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను విమర్శించే వారిని 'అర్బన్ నక్సల్స్'గా ముద్ర వేశారని, ఇప్పుడు ఇదే తరహాలో 'దిమాగీ నక్సల్స్' అనే కొత్త పదాన్ని తీసుకువచ్చారని బేబీ అన్నారు. మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నక్సలిజాన్ని అంతం చేశామని చెబుతున్న విధానంపై బేబీ ప్రశ్నలు లేవనెత్తారు. యువకులు, యువతను పట్టుకుని న్యాయప్రక్రియ ముందు నిలబెట్టే బదులుగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదమని అభివర్ణించారు. వామపక్షాలు నక్సలిజాన్ని ఎప్పుడూ సమర్థించలేదని బేబీ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, దిమాగీ నక్సల్స్ ఇప్పుడు రాజకీయ రచ్చకు దారి తీసింది.

## వర్షాభావం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని,

**ఏలూరు,**

వర్షాభావం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, డాక్టర్ ఎమ్ ఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అనుసరించి అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి, చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయాంకుల లక్ష్మణరావు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు కౌలు రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మార్పు రావాలి మార్పు కోరాలి అనే కార్యక్రమం సందర్భంగా రెండు సంఘాల ఏలూరు జిల్లా సమితుల ఆధ్వర్యంలో సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ధర్నా కార్యక్రమానికి ఏపీ కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ను వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వలె మన రాష్ట్రంలో కూడా 2 లక్షల రూపాయల వరకు రైతుల రుణాలను మాఫీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు ఇవ్వాలని, ఎలాంటి హామీలు లేకుండా కౌలు రైతులకు ఆర్బిఐ నిబంధనల ప్రకారం రెండు లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. పకృతి వైపరీత్యాలు వల్ల నష్టపోయిన రైతులకు గత మూడు సంవత్సరాల పంటల బీమా పరిహారం బకాయిల సుమారు 4400 కోట్లను వెంటనే చెల్లించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వర్షాభావం వల్ల నష్టపోయిన రైతులకు గత రెండేళ్ల ఇన్పుట్ సబ్సిడీ బకాయిలు 1200 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, రైతులకు ఇస్తున్న అన్ని రైతులు కౌలు రైతులకు వర్తింపచేయాలని వారు కోరారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రైతులందరికీ సబ్సిడీ కి అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. మొత్తం 25 డిమాండ్లతో వినతి పత్రాన్ని నాయకులు కలెక్టర్ కు సమర్పించారు. రైతుల ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, రైతు మరియు కౌలు రైతు సంఘాల నాయకులు కె. ఆనందరావు, కూచిపూడి నాగేశ్వరరావు, పంతగాని తిరుపతిరావు, మల్లిపూడి రంగారావు, ఎస్ నాగార్జున రావు, కే రామకృష్ణ, చందమాల వెంకటరత్నం, మేటకట్ల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## తహసిల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు

**ఏలూరు,**

గ్రామీణ పేదలకు సామాజిక న్యాయం-ఆత్మగౌరవం కల్పించాలని కోరుతూ ఆగస్టు 21వ తేదీ న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే ఎం యు) ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలకు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల గురవయ్య బండి వెంకటేశ్వరరావు వ్యవసాయ కార్మికులకు పిలుపునిచ్చారు. మార్పు రావాలి--మార్పు తేవాలి అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 21న జరిగే ఆందోళన కార్యక్రమాలను మండలాలలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు పేద ప్రజల సమీకరించి పెద్ద ఎత్తున చేయాలని వారు కోరారు. పేద ప్రజలకు సాగుభూములు పంచాలని, దశాబ్దాల తరబడి సాగు చేస్తున్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, వి ఎస్ ఎస్ లో కేటాయించిన భూములను వైఎస్ఆర్ సభ్యులకు వ్యక్తిగత హక్కుపత్రాలు ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాలలో ఇంటి స్థలం లేని పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. 2005లో సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ జి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం కోరుతుందని గురవయ్య వెంకటేశ్వరరావు తెలిపారు.

## రూ.500 కోట్లతో ఎంజేపీలకు శాశ్వత భవనాలు

**-శాసనసభలో మంత్రి సవిత**

**రూ.80 కోట్లతో అసంపూర్తి ఎంజేపీల నిర్మాణం**

**6 బాలికల బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్**

**బీసీ బాలికల డ్రాపౌట్ల నివారణే లక్ష్యంగా అప్ గ్రేడ్**

**కొత్తగా 10 బీసీ గురుకులాలు ఏర్పాటు**

**సీఎస్ఆర్, డీఎంఎఫ్ ఫండ్స్ తో బీసీ హాస్టళ్ల అభివృద్ధి**

**శిథిలమైన హాస్టళ్లను వేరే భవనాల్లో షిఫ్ట్ చేస్తున్నాం : మంత్రి సవిత**

**అమరావతి**

రూ.500 కోట్ల సాస్కి నిధులతో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, మరమ్మతులకు నిధులు కేటాయించామని తెలిపారు. వర్షా కాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మొదటిరోజు సోమవారం శాసనసభలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సవిత సమాధానాలిచ్చారు. నాణ్యమైన విద్యను అందిస్తున్న బీసీ గురుకులాలకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ బీసీ గురుకులాల భవనాలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఈ ఏడాది కొత్తగా 10 బీసీ గురుకులాలు స్థాపించామని, వాటిలో 5 రాయలసీమలో, మరో 5 ఉత్తరాంధ్రలో నెలకొల్పామని తెలిపారు. ఆరు బీసీ బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. బీసీ బాలికల డ్రాపౌట్ల నివారణకు జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. 50 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న బీసీ హాస్టళ్లను గురుకులాల్లో విలీనం చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరవాత ఏపీలో 32 బీసీ గురుకులాలు మాత్రం ఉన్నాయని, 2014-19 మధ్య 75 బీసీ గురుకులాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారని మంత్రి సవిత గుర్తు చేశారు. వాటిలో 25 ఎంజేపీలకు శాశ్వత భవనాల కోసం రూ.40 కోట్లను ఆనాడు మంజూరుచేయగా, 70 నుంచి 80 శాతం మేర పనులు సైతం పూర్తయ్యాయని అన్నారు. తరవాత వచ్చిన ప్రభుత్వం బీసీ గురుకులాలను పట్టించుకోకుండా గాలి కొదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసంపూర్తి గా నిలిచిపోయిన భవనాలకు నిధులు మంజూరు చేసిందన్నారు.గోనబావి, మడకశిర, రొద్దం, పులివెందుల సహా పలు ప్రాంతాల్లో ఉన్న గురుకులాల పనులు పున:ప్రారంభించామని, త్వరలోనే వాటిని పూర్తి చేసి బీసీ బిడ్డలకు అంకితం చేస్తామని తెలిపారు. బీసీ హాస్టళ్లలో 90,676 మంది విద్యార్థులు చదువుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హాస్టళ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సవిత తెలిపారు. సీఎస్ఆర్, డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్ ద్వారా హాస్టళ్ల మరమ్మతులు చేపట్టామన్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న హాస్టళ్లను వేరే భవనాల్లోకి షిఫ్ట్ చేశామన్నారు. మరికొన్నింటిని గుర్తించామని, వాటిని కూడా త్వరలో షిఫ్ట్ చేస్తామని తెలిపారు. హాస్టళ్లలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్య ఇస్తున్నామని, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇనర్వర్టర్లు, దోమ తెరలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ విధానం ప్రవేశపెట్టి వార్డెన్లు, విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగు పరిచామన్నారు. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణకు 1,291 మంది పారిశుధ్య సిబ్బందిని, 142 మంది కుక్, కమాటీలను నియమించామని తెలిపారు. 2026-27 బడ్జెట్ లో హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 కోట్లు కేటాయించామన్నారు. 2019-24 మధ్య ఆనాటి ప్రభుత్వం హాస్టళ్ల కనీస మరమ్మతులకు, వసతులకు నిధులు కూడా కల్పించలేదని మంత్రి సవిత తెలిపారు. రూ,.9.75 కోట్లతో భీమిలి బీసీ గురుకుల పాఠశాలకు అదనపు భవనం నిర్మిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. ఈ భవనానికి సంబంధించి అంచనాలు కూడా ఇప్పటికే రూపొందించామని, అనుమతులు రాగానే నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో భీమిలి ఎంజేపీ సహా 70 నుంచి 80 శాతం మేర అసంపూర్తి గా నిలిచిపోయిన ఎంజేపీ భవనాల నిర్మాణాల పూర్తికి కూటమి ప్రభుత్వం రూ.80 కోట్లు కేటాయించిందన్నారు. ఆరు నెలల్లో ఈ ఎంజేపీ భవనాలను బీసీ బిడ్డలకు అంకితం చేస్తామని మంత్రి సవిత తెలిపారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

## చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**చౌటుప్పల ఆగస్టు 18 (న్యూస్ వార్)**

పురపాలక సంఘం కార్యాలయంలో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాగంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ మేనేజర్ అంజయ్య,మున్సిపల్ కౌన్సిలర్లు, కొసనం రాకేష్ రెడ్డి, పూదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, బద్రి గాలయ్య, పాక చిరంజీవి, చింతల ఉమామహేశ్వరి సాయిలు, పిల్లలమర్రి మధుసూదన్, కో–ఆప్షన్ సభ్యులు పస్తం గంగా రాములు, మరియు నాయకులు ఉడుగు రమేష్, బత్తుల దాసు, షేక్ జానీ బాబా, పల్లె సురేందర్ రెడ్డి ,వివిధ రంగాల గౌడ సంఘ ప్రముఖులు, గౌడ సంఘ యువజన నాయకులు, మున్సిపల్ కార్యాలయ వార్డ్ అధికారులు, సిబ్బంది పాల్గొని సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాపన్న గౌడ్ బహుజనుల హక్కుల కోసం పోరాడిన యోధుడని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు జోహార్లు అర్పిస్తూ జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

## శ్రీ కంఠమహేశ్వరగౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ పాపన్న జయంతి



**చౌటుప్పల్ ఆగస్టు 18 (న్యూస్ వార్)**

ఎల్లగిరి గ్రామంలో సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లగిరి గ్రామ సర్పంచ్ రిక్కల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ సామాజికంగా, ఆర్థికంగా బహుజనులను ఏకం చేసిన గొప్ప వీరుడని అన్నారు. శ్రీ కంఠమహేశ్వరగౌడ సంఘ అధ్యక్షులు మారగోని అశోక్ గౌడ్ మాట్లాడుతూ. బడుగు బలహీన వర్గాలపై జరుగుతున్న దౌర్జన్యానికి భూస్వాములు, పెత్తందార్లకు వ్యతిరేకంగా గోల్కొండ కుతుబ్ షాహీల తో పోరాడి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకొని పరిపాలించిన వీరుడు సర్దార్ పాపన్న అన్నారు. రకరకాల భూమి పన్నులకు వ్యతిరేకంగా పోరాడి, భూస్వాముల వంచనతో ప్రాణం త్యాగం చేసిన ధీరుడు అని చరిత్ర లిఖించని మహనీయుడని కొనియాడారు. ప్రధాన కార్యదర్శి మారగోని జంగయ్య గౌడ్ మాట్లాడుతూ గోల్కొండ కోటని పాలించిన పాపన్న మొగల్ చక్రవర్తులపై దండెత్తిన మొదటి తెలంగాణ పోరుబిడ్డ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడిన వ్యక్తిగా కీర్తించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, వార్డుమెంబెర్ ఇబ్రహీం, సందీప్,సంతోష బలగొని నర్సింహ్మా, కొత్త శ్రీశైలం, మారగోని అశోక్, జంగయ్య దయాకర్, పెద్ద అంజయ్య గౌడ్,చిన్న గౌడ్, శ్రీను, మల్లేశం, కొమ్మ గొని శీను,పల్సశీ అంజయ్య గౌడ్, తెనుగు అంజయ్య, పుట్ట నాగరాజు, కరొబార్ నవ్య పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు

**చౌటుప్పల ఆగస్టు 18 (న్యూస్ వార్)**

మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామ చౌరస్తా వద్ద మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొయ్యడ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన సేవలు, సామాజిక సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, ఆలే శ్రీలత చిరంజీవి, గడ్డం ఇందిరా రాజరత్నం, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్, బీఆర్ఎస్ సత్య ప్రమాణాలకు వేదిక కానున్న హనుమాన్ ఆలయం

### – మగాడివైతే ఆరోపణలు నిజమని ప్రమాణం చేయి మాజీ ఎమ్మెల్యేకు మున్సిపల్ చైర్మన్ సవాల్...

**చందూరు ఆగస్టు 18 (న్యూస్ వార్ )**

చందూరు సెంటర్లో నిన్న బి ఆర్ ఎస్ పార్టీ నిర్వహించిన ధర్నాలో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపాయి. ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ గా ఈరోజు పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోడి వెంకన్న మాట్లాడుతూ నోరు ఉంది కదా అని కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పై మున్సిపల్ పాలకవర్గంపై



అనేక నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించారని. తమపై చేసిన ఈ అవినీతి ఆరోపణలు నిజమని ఆధారాలతో నిరూపించాల్సిన బాధ్యత కూసుకుంట్ల మీద ఉందని తెలియజేశారు. తాము పండ్లబండ్ల దగ్గర వైన్ షాప్ ల వద్ద ఎలాంటి అక్రమార్జనకు పాల్పడలేదని, శనివారం రోజు తడి బట్టలతో స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రమాణం చేయనున్నట్లు తెలియజేశారు. అదే సమయంలో మేము అక్రమార్జనకు పాల్పడ్డామని నువ్వు తడి బట్టలతో ప్రమాణం చేయగలవా అంటూ ప్రశ్నించారు. అలా చేసే దమ్ము ధైర్యం నీకు ఉందా అంటూ ఎద్దేవా చేశారు. నీవు మగాడివైతే ఈ శనివారం ఉదయం 9 గంటలకు ఆంజనేయ స్వామి కూడా వద్దకు వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో పాల్గొన్న పండ్లబండ్ల యజమానులు కూసుకుంట్ల చేసిన ఆరోపణలో ఎలాంటి నిజం లేదని తాము ఎవరికి అణా పైసా కూడా ఇచ్చింది లేదని తెలియజేస్తూ, బడ్డీకోట్ల వాళ్లు, వైన్ షాపుల, పండ్లబండ్ల యజమానులు మున్సిపల్ చైర్మన్ తో పాటు తాము కూడా ప్రమాణం చేయడానికి శనివారం ఆంజనేయ స్వామి దేవాలయానికి వస్తున్నట్లు ఈ సమావేశంలో తెలియచేసారు. తాము మున్సిపల్ పాలకవర్గానికి డబ్బులు ఇచ్చినట్లు కూసుకుంట్ల కూడా వచ్చి ప్రమాణం చేయాలని వారు ఆహ్వానించారు. ఇరు పార్టీలో రాజకీయ వేడి రగిలించిన ఈ అవినీతి ఆరోపణల నిర్ధారణకు శనివారం రోజు ఆంజనేయ స్వామి దేవాలయం వేదిక కానుండటంతో ప్రజలంతా ఆత్రంగా శనివారం కోసం ఎదురుచూస్తూ చండూరు మరో కాణిపాకంగా మారింది. అంటూ చర్చించుకుంటున్నారు.

# కూసుకుంట్ల నోరు అదుపులో పెట్టుకో

### మాజీ ఎమ్మెల్యేకు చైర్మన్ కోడి శ్రీనివాస్ హెచ్చరిక

**చందూర్ ఆగస్టు 18 (న్యూస్ వార్)**

మండల కాంగ్రెస్ పార్టీ స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఈరోజు నిర్వహించిన ప్రెస్ మీట్ లో చందూరు మున్సిపల్ కౌన్సిలర్ కోడి శ్రీనివాసులు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పై తీవ్రంగా ధ్వజమెత్తారు. టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిన్న జరిగిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించకుండా, నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని. న్యాయపరమైన చిక్కుల వల్ల కల్యాణ లక్ష్మి పథకం తాత్కాలికంగా మాత్రమే ఆగిపోయిందని త్వరలో ఆ సమస్యలను పరిష్కరించి యధావిధిగా కళ్యాణలక్ష్మి షాది ముబారక్ పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వం తీవ్ర కృషి చేస్తుందని ఆయన తెలియజేశారు. వాటర్ ట్యాంక్ సెంటర్ గా 30 ఏళ్లుగా బస్సులు నడుస్తున్నప్పటికిని ప్రయాణికులకు నిలువ నీడ లేదని రోడ్డు వెడల్పు చేయకముందు షాపుల ముందు ఉండే బాల్కనీలలో ప్రయాణికులు వేచి ఉండే వారిని రోడ్డు వెడల్పులో బాల్కనీలు తొలగించడం వల్ల ప్రయాణికుల పరిస్థితి దుర్భరంగా తయారవడంతో తాను ఈ సమస్యను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే ప్రజల సౌకర్యార్థం తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిర్మాణానికి సంబంధించిన స్థల మార్పిడి విషయంలో పండ్ల బండ్లు, వైన్స్ షాపుల వద్ద డబ్బులు తీసుకున్నారంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని తను 10 సంవత్సరాల్లో ఎమ్మెల్యేగా ఉన్నప్పటికిని ఎలాంటి అభివృద్ధికి నోచుకోని చందూరు మా పాలకవర్గం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలోనే మున్సిపాలిటీలో చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని, నిజా నిజాలు తెలుసుకోకుండా మాట్లాడితే బాగుండదని నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్, పాలకవర్గంపై అవినీతి ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమైన చర్య.



మేము అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. మాపై చేసిన ఆరోపణలను నిరూపించేందుకు మాజీ ఎమ్మెల్యే సిద్ధమా? అంటూ ప్రశ్నించారు. పచ్చకామర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు తాను అవినీతిపరుడైనందువల్ల అందరూ అవినీతి చేస్తారని కోవడం అవివేకమని అంటూ హాస్టల్ వార్డెన్ గా పనిచేస్తున్న సమయంలో నువ్వు ఎందుకు సస్పెండ్ అయ్యావో అందరికీ తెలుసని అలాంటి నువ్వు మమ్మల్ని అవినీతిపరుడు అనడం హాస్యాస్పదమని అన్నారు. మేము అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ఎలాంటి ప్రమాణం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాం నువ్వు ప్రమాణం చేయగలవా అంటూ నిలదీశారు మాజీ ఎమ్మెల్యే ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోని ప్రజలను తప్పుదోవ పట్టించే నిరాధార ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని లేకపోతే చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తూ, మాజీ ఎమ్మెల్యే మతి భ్రమించినట్లుగా మాట్లాడటం మానుకుని, చండూరు అభివృద్ధికి సహకరించాలని, తమ పాలకవర్గం ఎమ్మెల్యే కోమటిరెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకమైన పాలనను అందిస్తామని వారు తెలియజేశారు ఈ పత్రిక సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బూతు రాజు దశరథ, మాజీ సర్పంచ్ కోడిగిరి బాబు, కో ఆప్షన్ సభ్యులు ఎస్.కె ఖలీల్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐతరాజు మల్లేష్, కోడి వెంకన్న, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, పళ్ళబండ్ల, వైన్ షాపుల ఓనర్లు పాల్గొన్నారు

# వచ్చే ఏడాది నుంచి ఏటీసీల్లో 'స్కిల్ కాంపిటీషన్స్': మంత్రి వివేక్ వెంకటస్వామి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దూరదృష్టితో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) యువతను ఇన్నోవేటర్లుగా తీర్చిదిద్దే వేదికలుగా మారుతున్నాయని కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్ మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఏటీసీని సందర్శించిన ఆయన, విద్యార్థులు పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన వినూత్న విద్యుత్ వాహనాలను పరిశీలించి వారిని అభినందించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు కేవలం రెండేళ్ల శిక్షణతోనే రీసైకిల్ విడిభాగాలతో తక్కువ ఖర్చుతో విద్యుత్ వాహనాలను తయారు చేయడం రాష్ట్ర నైపుణ్య శిక్షణ వ్యవస్థకు నిదర్శనమని ప్రశంసించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వివిధ సంస్థల్లో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.టాటా సంస్థ భాగస్వామ్యంతో రూ.4 వేల కోట్ల పెట్టుబడితో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్న 119 ఏటీసీల్లో వచ్చే ఏడాది నుంచి ప్రతి ఏటా 'స్కిల్ కాంపిటీషన్స్' నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ పోటీల్లో టాప్––10లో నిలిచే ప్రతిభావంతులకు ప్రత్యేక అవార్డులు, ప్రోత్సాహకాలు అందించడంతో పాటు ఏటీసీల్లోనే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆవిష్కరణలను కేవలం ప్రదర్శనలకే పరిమితం చేయకుండా మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన నిధులు, ప్రోత్సాహాన్ని సమకూరుస్తుందని తెలిపారు. పాత ఐటీఐ కోర్సుల స్థానంలో పారిశ్రామిక అవసరాలకు తగిన సరికొత్త సాంకేతిక కరిక్యులమ్‌ను ప్రవేశపెట్టామని, మణుగూరు ఏటీసీలోని 100 మంది విద్యార్థులకు టాటా సంస్థలోనే ఉద్యోగాలు కల్పిస్తామని హామీ లభించిందని వివరించారు.ఆర్థిక ఇబ్బందుల వల్ల విద్యార్థులు శిక్షణకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్‌తో పాటు ఉచిత అల్పాహారాన్ని అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 'టామ్‌కామ్' ద్వారా రూ.90 కోట్లు కేటాయించి జర్మన్, జపనీస్ భాషల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే మణుగూరు యువత కోసం ఐటీసీ సంస్థ సీఎస్ఆర్ నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటును పరిశీలించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఉపాధి శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ నగేశ్, రీజినల్ డైరెక్టర్ రాజా, డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,